సాక్షి

శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం । 15 । అక్టోబర్ । 2025



టన్ను చీనీ రూ.15 వేలు
అనంతపురం మార్కెట్ యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.15 వేలు, కనిష్టంగా రూ.8 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.20
అనంతపురం కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.20, కనిష్టంగా రూ.10 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
34.1°/20.6°
జిల్లా పరిధిలో మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో ఈశాన్యం నుంచి నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

పీఏబీఆర్‌లో ఆగిన జల విద్యుత్ ఉత్పత్తి

- దెబ్బతిన్న గేట్ లింక్



పీఏబీఆర్‌లోని జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం

కూడేరు: పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్) వద్ద ఏర్పాటైన ఏపీ జెన్‌కో జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి ఆగిపోయింది. డ్యాం నుంచి జల విద్యుత్ ఉత్పత్తికి నీటిని సరఫరా చేసే ప్రాంతంలోని గేట్ లింక్ దెబ్బతింది. దీంతో నీటిని విడుదల చేయడానికి గేట్ పైకి లేవడం లేదు. గేట్‌ను పైకి ఎత్తేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నప్పటికీ ఫలితం లేకుండాపోయింది. ఈ నెల 5న జల విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించిన విషయం తెలిసిందే. మంగళవారం నాటికి 3 లక్షల యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసినట్లు ఏపీ జెన్ కో జేఈ కిరణ్ తెలిపారు. బుధ, గురువారాల్లో గేట్ లింక్‌కు మరమ్మతులు పూర్తి చేసేందుకు ఇరిగేషన్, జెన్‌కో సివిల్ అధికారులు చర్యలు చేపడుతున్నారు. మరమ్మతులు పూర్తి కాగానే యథావిధిగా జల విద్యుత్‌ను ఒక టర్బైన్‌లో గంటకు 3 వేల చొప్పున రోజుకు సుమారు 72,500 యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తామని జేఈ కిరణ్ తెలిపారు.

29న రొళ్ల ఎంపీపీపై అవిశ్వాసం



బీజీ హళ్లి ఎంపీటీసీ విశాలక్షికి నోటీసు అందిస్తున్న ఏఓ ప్రసాద్

రొళ్ల: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ, వైస్ ఎంపీపీలపై అవిశ్వాస తీర్మానానికి ఈనెల 29న ప్రత్యేక సమావేశం నిర్వహిస్తునట్లు ఎంపీడీఓ నాగేశ్వరావుశాస్త్రి తెలిపారు. ఇందులో భాగంగానే మండలంలోని 11 మంది ఎంపీటీసీలకు అధికారులు మంగళవారం నోటీసులను అందించారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీలను పదవి నుంచి తప్పించేందుకు ఈ నెల 7, 8 తేదీల్లో అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని జాయింట్ కలెక్టర్, ఆర్‌డీఓ, జిల్లా పరిషత్ సీఈఓ, స్థానిక ఎంపీడీఓకు మండలంలోని 8 మంది ఎంపీటీసీలు వినతిపత్రం ఇచ్చిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆర్‌డీఓ ఆనంద్‌కుమార్ ఉత్తర్వులు మేరకు ఎంపీడీఓ నాగేశ్వరావుశాస్త్రి ఆధ్వర్యంలో మండలంలోని 11 మంది ఎంపీటీసీలకు ఏఓ ప్రసాద్, ఈఓఆర్‌డీ శ్రీనాథ్ నోటీసులిచ్చారు.

- **మా**జీ మంత్రి పరిటాల సునీత ఇలాకా రామగిరి మండలం దుబ్బార్లపల్లికి చెందిన సాకే సదాశివ కొన్నేళ్లుగా అమాయకులే లక్ష్యంగా మోసాలకు పాల్పడుతున్నాడు. ఇప్పటికే అతనిపై అనంతపురం 1, 4వ పట్టణ పోలీస్‌స్టేషన్‌ల్లో కేసులు నమోదయ్యాయి. అక్కడి నుంచి జిల్లా కేంద్రమైన పుట్టపర్తికి మకాం మార్చి పుట్టపర్తి నుంచి పెనుకొండ మీదుగా రామగిరి వరకూ పింఛన్‌దారులే లక్ష్యంగా మోసాలకు తెరలేపాడు. నెల వ్యవధిలోనే రూ.లక్షలు దండుకుని పత్తా లేకుండా పోయాడు.''
- **జి**ల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లోని స్టాటిస్టిక్ డిపార్టుమెంట్‌లో కీలక ఉద్యోగిగా సదాశివ చెలామణి అవుతూ పుట్టపర్తి పట్టణ శివారులోని సత్యసాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సమీపంలో మకాం ఏర్పాటు చేసుకుని ఇద్దరు ముగ్గురితో రూ.లక్షల్లో వసూలు చేశారు. రోడ్డు ప్రమాదంలో కాలు పోగొట్టుకున్న వ్యక్తికి పింఛన్ ఇప్పిస్తానని రూ.50 వేలు తీసుకున్నాడు. మరో వ్యక్తితో మున్సిపల్ ఆఫీసులో పని చేయిస్తానని రూ.75 వేలు దండుకున్నాడు. ఇంకో యువకుడితో ఉద్యోగం ఇప్పిస్తానని రూ.35 వేలు ముక్కుపిండి వసూలు చేశాడు.
- **రా**మగిరి మండలంలో కొందరికి ఫోన్ చేసి తాను కలెక్టరేట్‌లో ఏఎస్‌ఓగా పని చేస్తున్నానని, వచ్చే నెలలో మీకు పింఛన్ తీసేస్తున్నారని.. కొంత మొత్తం ముట్టచెబితే పింఛన్ ఆగకుండా చేస్తానంటూ ఒక్కొక్కరితో రూ.5 వేల నుంచి రూ.25 వేల వరకూ డిమాండ్ చేశాడు. ఒకరిద్దరు తమకు అర్హత ఉందని, ఎందుకు ఆగుతుందని ప్రశ్నించడంతో కంగు తిన్నాడు. మిగతా వారు మాత్రం అతని ట్రాప్‌లో చిక్కుకున్నారు.

సదా మోసమే !



సాకే సదాశివ

పింఛన్, ఉద్యోగాల పేరుతో డబ్బు వసూలు

- కలెక్టరేట్‌లో కీలక ఉద్యోగినంటూ బురిడీ
- అమాయకులే లక్ష్యంగా మోసాలు
- సదాశివ కుటుంబ సభ్యులు, బంధువులందరూ పరిటాల వర్గీయులే !

సాక్షి, టాస్క్‌ఫోర్స్: పని చేసేందుకు అవయవాలు సరిగా లేక .. అంగ వైకల్యంతో బాధపడే వారికి సాయం చేయడం మాని.. వారిని మోసం చేసి అందినకాడికి దోచుకుంటున్నాడు రామగిరి మండలం దుబ్బార్లపల్లికి చెందిన సాకే సదాశివ. పింఛన్ ఇప్పిస్తానని నమ్మబలికి డబ్బులు వసూలు చేస్తున్నాడు. పర్సెంటేజీలు పెంచి మరింత పింఛన్ సౌకర్యం వస్తుందని.. కాకపోతే అధికారులకు కొంత మొత్తం నగదు ముట్టజెప్పాలని మాయమాటలు చెప్పి రూ.లక్షల్లో దండుకున్నాడు.

ట్రూ కాలర్ యాప్‌తో మోసం

'ట్రూ కాలర్' యాప్‌ను చెక్ చేస్తే ''శివ కలెక్టరేట్'' వచ్చేలా మొబైల్‌లో సెట్టింగ్స్ మార్చుకుని.. అమాయకులు, దివ్యాంగులే లక్ష్యంగా చేసుకున్నాడు. నెల రోజుల వ్యవధిలోనే రూ.లక్షలు కొల్లగొట్టాడు. మోసపోయామని తెలుసుకునేలోపే పుట్టపర్తి నుంచి ఉడాయించాడు. గతంలో అనంతపురంలో కూడా ఆర్థిక మోసాలకు పాల్పడ్డాడు. అనంతపురం 1, 4వ పట్టణ పోలీస్ స్టేషన్‌లలో కేసులు కూడా నమోదైనట్లు తెలిసింది. అనంతపురం నుంచి పుట్టపర్తికి మకాం మార్చి.. హిందూపురం, పెనుకొండ, గోరంట్ల తదితర ప్రాంతాల్లో పలువురికి ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేసినట్లు సమాచారం.

వాట్సాప్ గ్రూప్ ద్వారా ...

టీ స్టాల్, హోటల్, చాట్ బాండార్‌ల దగ్గర అక్కడున్న వారిని పరిచయం చేసుకుంటాడు. గుంపుగా కాకుండా ఒక్కొక్కరితో వేర్వేరుగా మాట్లాడుతూ.. పదే పదే 'ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం' అనే పేరు కనిపించే వాట్సాప్ గ్రూప్‌లను చూపిస్తూ.. తాను కలెక్టరేట్‌లో కీలక ఉద్యోగి నంటూ నమ్మబలుకుతాడు. ఫోన్ నంబరు ఇచ్చి.. వారం రోజుల పాటు ఉదయం, సాయంత్రం వేళల్లో టచ్‌లోకి వెళ్లి.. వివరాలపై ఆరా తీస్తాడు. అధిక వడ్డీలకు డబ్బులు ఇస్తానని చెబుతాడు. మీ దగ్గర ఉంటే ఇవ్వాలని అడుగుతాడు. అత్యవసరం ఉందని ఒత్తిడి తెస్తాడు. డ్యూటీలో ఉన్నానంటూ కొన్నిసార్లు ఫోన్లు ఎత్తడు. పక్కా ప్లానింగ్‌తోనే పది రోజుల పాటు పరిచయమైన వారితో టచ్‌లోకి వెళ్లి డబ్బులు దండుకుని పరారవుతాడు. ఇప్పటికే అనంతపురం, హిందూపురం, పెనుకొండలో మోసాలు చేసినట్లు తెలిసింది. తాజాగా పుట్టపర్తిలో మకాం వేసి పింఛన్ ఇప్పిస్తానని నమ్మబలికి సరికొత్త దందాకు శ్రీకారం చుట్టాడు.



పోలీసుల అదుపులో ఉన్న సదాశివ (ఫైల్)

ఆ పేరుతో ఎవరూ లేరు

అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ శివ పేరుతో కలెక్టరేట్‌లో ఎవరూ లేరు. పుట్టపర్తి కలెక్టరేట్‌లో ఏఎస్‌ఓగా పని చేస్తున్న శివగా పరిచయమైన వ్యక్తి మాకు తెలీదు. కలెక్టరేట్‌లో పని చేసే ఉద్యోగి పేరుతో ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే ఫిర్యాదు చేయండి. అపరిచిత వ్యక్తులను నమ్మి ఎవరూ మోసపోవద్దు. కలెక్టరేట్‌లో పనులు చేయిస్తామని.. ప్రజల దగ్గర డబ్బులు అడిగితే.. ఫోన్ నంబరు, వ్యక్తి వివరాలతో ఫిర్యాదు చేయండి.

– విజయ్‌కుమార్, సీపీఓ

ఎవరీ సాకే సదాశివ?

రామగిరి మండలం దుబ్బార్లపల్లికి చెందిన బిజ్జప్ప కుమారుడు సదాశివ. అనంతపురంలో విద్యాభ్యాసం పూర్తి చేశాడు. ఆ తర్వాత మోసాలకు అలవాటు పడి.. ఇటుకలపల్లి అడ్రస్‌తో పలు ప్రాంతాల్లో సంచరిస్తూ.. మొబైల్ నంబర్లు తరచూ మారుస్తూ బంధువులకు కూడా అందుబాటులో ఉండడు. దుబ్బార్లపల్లిలో సదాశివ బంధువులందరూ టీడీపీ వర్గీయులే. పరిటాల సునీత వెంట నడిచే వాళ్లే కావడం విశేషం.

అప్రమత్తంగా ఉండాలి

కేటుగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని రామగిరి పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల దివ్యాంగులకు ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేయడం కోసం వారి వైకల్యం శాతాన్ని నిర్ధారించేందుకు పరీక్షలు చేసిందని, ఇదే అదునుగా భావించిన కొందరు కేటుగాళ్లు డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయని చెబుతున్నారు. కలెక్టరేట్‌లో పని చేసే శివగా చెప్పుకుంటూ రామగిరి మండలం దుబ్బార్లపల్లికి చెందిన సదాశివ కొందరితో డబ్బులు తీసుకున్నట్లు తెలిసింది. అతడి మాటలు ఎవరూ నమ్మి మోసపోవద్దంటున్నారు. ఎవరికైనా ఫోన్ కాల్స్ వస్తే రామగిరి పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలన్నారు..

గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి

- వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకులు రమేష్‌రెడ్డి

కదిరి టౌన్: గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు రమేష్‌రెడ్డి కార్యకర్తలకు సూచించారు. మంగళవారం కదిరి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్య అతిథిగా రమేష్‌రెడ్డి హాజరై మాట్లాడారు. పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని, అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. కదిరి నియోజకవర్గంలోని అన్ని పంచాయతీల్లో గ్రామస్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. రెండు పంచాయతీలకు ఒక పరిశీలకుడు ఉంటారని, పరిశీలకుల సమక్షంలోనే గ్రామ కమిటీలను ఎంపిక చేయాలన్నారు. అలాగే ప్రతి మండలానికి ఒకరు పరిశీలకులుగా వ్యవహరిస్తారని చెప్పారు. జంబ్లింగ్ పద్ధతిలో పరిశీలకులను నియమించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం మండల పరిశీలకులను ఎంపిక చేశారు. కదిరి రూరల్‌కు శ్రీనివాసులు నాయుడు, తనకల్లుకు కేవీ ప్రణీత్‌రెడ్డి, నల్లచెరువుకు మాలే శ్రీకాంత్‌రెడ్డి, గాండ్లపెంటకు లింగాల లోకేశ్వర్‌రెడ్డి, ఎన్పీ కుంటకు డాక్టర్ బత్తల హరిప్రసాద్, తలుపులకు అత్తార్ చాంద్ బాషాను నియమించారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌రెడ్డి

అనుమతులు లేకుండా టపాసులు విక్రయిస్తే చర్యలు

- కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్

ప్రశాంతి నిలయం: దీపావళి పండుగ నేపథ్యంలో అనుమతులు తీసుకోకుండా టపాసులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్లో కలెక్టర్.. ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్‌తో కలసి దీపావళి సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ అధికారులు నిబంధనల మేరకు టపాసుల విక్రయ లైసెన్స్‌లు మంజూరు చేయాలన్నారు. టపాసులు విక్రయించే చోట ప్రమాదాలకు తావులేకుండా భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. టపాసుల విక్రయదారులు అనుమతుల మేరకే నిల్వ ఉంచుకోవాలని, గోడౌన్‌ల దగ్గర అన్ని సురక్షిత పద్ధతులు పాటించాలన్నారు. జన సంచారం ఉన్న ప్రాంతాల్లో, ప్రజల నివాసం ఉన్న చోట టపాసులు విక్రయించకూడదని స్పష్టం చేశారు. పోలీసు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమంగా టపాసులు విక్రయించినా, నిల్వ ఉంచినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమంగా టపాసుల విక్రాయాలపై ప్రజలు 112కు సమాచారం ఇవ్వొచ్చన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

సత్యసాయి శత జయంతి వేడుకలకు రండి

- ఉప రాష్ట్రపతిని ఆహ్వానించిన ట్రస్ట్ సభ్యులు



సత్యసాయి చిత్రపటాన్ని ఉప రాష్ట్రపతికి బహూకరిస్తున్న ఆర్‌జే రత్నాకర్‌రాజు

ప్రశాంతి నిలయం: సత్యసాయి శతజయంతి వేడుకల్లో పాల్గొనాలంటూ ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌ను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు ఆహ్వానించారు. మంగళవారం ఢిల్లీలో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్‌రాజు ఉప రాష్ట్రపతిని కలసి ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మానవాళికి అందిస్తున్న సేవా కార్యక్రమాలను ఆర్‌జే రత్నాకర్‌రాజు వివరించారు. సత్యసాయి బోధనలు, ఆధ్యాత్మిక తత్వాన్ని తరతరాలకు అందించేందుకు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ చేస్తున్న కృషిని తెలియజేశారు. స్పందించిన ఉప రాష్ట్రపతి సత్యసాయి ట్రస్టు చేస్తున్న సేవలను కొనియాడారు. సత్యసాయి శత జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు రత్నాకర్‌రాజు తెలిపారు.

'సురక్ష' యాప్ ద్వారానే మద్యం విక్రయాలు

అనంతపురం సెంట్రల్: నకిలీ మద్యం నిర్మూలనకు కఠిన చర్యల్లో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారానే మద్యం అమ్మకాలు చేపట్టాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ ఉమ్మడి జిల్లా డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య మంగళవారం ఒక ప్రకటనలో ఆదేశాలు జారీ చేశారు. సులువుగా మద్యం నాణ్యతను కనుక్కునే విధంగా ఈ యాప్‌ను రూపొందించినట్లు వివరించారు. ప్రతి మద్యం షాపు, బార్ లైసెన్స్‌దారుడు ఎక్సైజ్ సురక్షయాప్ ద్వారానే మద్యం విక్రయాలు చేయాలని ఆదేశించారు. వినియోగదారులు కూడా ఎలాంటి అనుమానాలున్నా యాప్ ద్వారా నివృత్తి చేసుకోవాలని సూచించారు.

అధ్యాపకులూ నిత్య విద్యార్థులే..



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ హెచ్ సుదర్శనరావు

అనంతపురం: అధ్యాపకులూ నిత్య విద్యార్థులేనని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ హెచ్.సుదర్శనరావు అన్నారు. అడ్వెంట్ గ్లోబల్ ఫౌండేషన్ క్యూక్లైర్ ఓయాన్స్ , జేఎన్‌టీయూ అనంతపురం సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజులు పాటు అధ్యాపకులకు భావి నైపుణ్య శిక్షణ తరగతులు (అప్ స్కిల్లింగ్ ప్రోగ్రామ్) నిర్వహిస్తున్నారు. మంగళవారం వీసీ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. క్వాంటం టెక్నాలజీలో ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులకు పరిపూర్ణమైన అవగాహన కల్పించడమే దీని ముఖ్య ఉద్దేశ్యమన్నారు. తొలి రోజు క్వాంటం టెక్నాలజీ అంశాలపై సీ–డాక్ ప్రాజెక్ట్ ఇంజినీర్ డాక్టర్ దివ్యాన్ష్ శ్రీనాలి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ కృష్ణయ్య, డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ అండ్ ప్లానింగ్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, ఫ్యూచర్ స్కిల్ డెవలప్‌మెంట్, ఇంకుబేషన్ సెంటర్ డైరెక్టర్ సి. శోభాబిందు పాల్గొన్నారు.

అన్నదాతకు 'నై'రుతి దెబ్బ !

- ఆగస్టు తప్ప నాలుగు నెలలూ లోటు వర్షపాతమే
- తుపానులు రాకుంటే రబీకీ గడ్డు కాలమే
- ఖరీఫ్‌లో సాగైంది కేవలం 75 వేల హెక్టార్లు
- ప్రత్యామ్నాయం లేక అన్నదాత ఆందోళన

పుట్టపర్తి అర్బన్: నైరుతి రుతు పవనాలు ఈసారి పెద్దగా ప్రభావం చూపలేదు. అనుకున్నంతగా వర్షాలు లేకపోవడంతో అన్నదాతలు పంటల సాగుకు మొగ్గు చూపలేదు. ఆగస్టు నెల తప్ప మిగతా నాలుగు నెలలు లోటు వర్షపాతం నమోదు కావడంతో కర్షకులకు ఎదురుదెబ్బ తగిలింది.

వేరుశనగ రైతులకు నష్టాలు

జూన్ మొదటి వారంలో రాష్ట్రంలోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు ఈ ఏడాది లోటు వర్షపాతాన్నే మిగిల్చింది. జూన్ జులై మాసాల్లో ఎన్నడూ లేనంతగా అతి తక్కువ వర్షాలు కురిశాయి. దీంతో రైతులు కొనుగోలు చేసిన వేరుశనగ విత్తనాలు సైతం మార్కెట్‌లో అమ్ముకున్నారు. వర్షాలు కురుస్తాయన్న ధైర్యంతో సాగు చేసిన పంటలు ఇప్పుడిప్పుడే చేతి కొస్తున్నాయి. ముందుగా వేరుశనగ సాగు చేసిన రైతులు తీవ్ర నష్టాలను చూశారు. వేరుశనగ పంటకు ఎకరాకు సుమారు రూ. 50 వేలు ఖర్చు చేయగా రూ.20 వేలు కూడా రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట సాగుతో పాటు ఎరువులు, కూలీలు, మందుల పిచికారీకి విపరీతంగా ఖర్చు చేయగా.. పంట చేతికొచ్చే సమయానికి గిట్టుబాటు ధర లేక పోవడంతో లబోదిబోమంటున్నారు. పరిహారమైనా ఇవ్వక పోతారా అని ఆశపడిన రైతులకు కూటమి ప్రభుత్వం మొండి చేయి చూపింది. వర్షాలు పడక ఖరీఫ్‌లో ఎక్కువ మంది రైతులు నష్టపోవడంతో రబీలో పంటలు సాగు చేయాలా వద్దా అని అన్నదాతలు సంశయంలో ఉన్నారు.

ఖరీఫ్‌లో 75 వేల హెక్టార్లలో సాగు

జిల్లాలో సాధారణంగా ఖరీఫ్‌లో 2,69,022 హెక్టార్లలో పంటలు సాగు చేస్తారు. ఇందులో అత్యధికంగా వేరుశనగ 1,51,824 హెక్టార్లలో సాగు చేయాల్సి ఉండగా కేవలం 37 వేల హెక్టార్లలో సాగు చేశారు. కంది 28,925 హెక్టార్లలో సాగు చేయాల్సి ఉండగా కేవలం 12,586 హెక్టార్లలో సాగు చేశారు. మొక్కజొన్న సుమారు 11 వేల హెక్టార్లు, వరి 2500 హెక్టార్లు, పత్తి 3390 హెక్టార్లు, ఆముదము 2300 హెక్టార్లు సాగు చేశారు. వీటితో పాటు రాగి, సజ్జ, జొన్న, ఉలవ, పొద్దుతిరుగుడు తదితర పంటలు సాగు చేశారు. రబీ సీజన్‌లో సుమారు 63 వేల హెక్టార్లు పంట సాగులోకి రావాల్సి ఉంది. నేటికీ సరైన వర్షాలు లేకపోవడంతో కనీసం ప్రత్యామ్నాయ పంటల సాగు చేయడం కూడా కష్టంగా ఉందని రైతులు వాపోతున్నారు.

రైతులను పట్టించుకోని కూటమి సర్కార్

జిల్లాలో ప్రత్యామ్నాయ పంటలైన ఉలవ, జొన్న, పెసర, అలసంద పంటలను రైతులు అత్యధికంగా సాగు చేస్తారు. ప్రతి ఏటా 64 వేల హెక్టార్లలో ప్రత్యామ్నాయ పంటలు వేస్తారు. అయితే ఈసారి ప్రత్యామ్నాయ విత్తనాలను కూడా ప్రభుత్వం పంపిణీ చేయకపోవడంతో ఆ భూములన్నీ బీడుగా మారే అవకాశం ఉంది. ప్రత్యామ్నాయ విత్తనాలు అందిస్తే కనీసం జీవాల మేతకు వాడతారు. ఈసారి విత్తనాలు ఇవ్వక పోవడంతో జీవాలకు మేత కూడా కరువవుతుందని రైతులు వాపోతున్నారు. వెంటనే విత్తనాలు పంపిణీ చేయాలని కోరుతున్నారు.



మామిళ్లకుంట క్రాస్ వద్ద రబీ సాగు కోసం సిద్ధం చేసిన భూమి

నైరుతిలో వర్షపాతం ఇలా..

నెల	కురవాల్సింది	కురిసింది
జూన్	66.6 మి.మీ	34.8 మి.మీ
జూలై	70.9 మి.మీ	33.6 మి.మీ
ఆగస్టు	83.4 మి.మీ	197.8 మి.మీ
సెప్టెంబర్	125.6 మి.మీ	89.8 మి.మీ
అక్టోబర్	120.1 మి.మీ	61.7 మి.మీ (ఇప్పటిదాకా)

గతమెంతో ఘనం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ రైతులకు అన్ని విధాలా అండగా నిలిచారు. ఖరీఫ్‌లో విత్తనాలు, ప్రత్యామ్నాయ విత్తనాలు, రబీలో శనగ, వేరుశనగ విత్తనకాయలతో పాటు ఎరువులు కూడా పంపిణీ చేసేవారు. సాగు చేసే సమయానికి రైతు భరోసా, పంట నష్టపోతే అదే సీజన్ ముగిసే సమయానికి పంట నష్టపరిహారంతో పాటు పంటలకు గిట్టు బాటు ధరలు దక్కేవని రైతులు గుర్తు చేసుకుంటున్నారు. నైరుతి రుతు పవనాల కాలం ముగియనుండగా ఈశాన్య రుతు పవనాలు ప్రవేశించనున్నాయి. కనీసం ఈ సమయంలోనైనా వర్షాలు కురిస్తే పంటల సాగుకు అనుకూలంగా ఉంటుంది లేదంటే మళ్లీ వలసలు తప్పేలాలేవని అంటున్నారు.

పెట్టుబడి కూడా దక్కలేదు



ఖరీఫ్‌లో నేను 3.5 ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశాను. భూమి సాగుకు, విత్తనాలకు, ఎరువులు, రోగాలు వచ్చినప్పుడు మందులు పిచికారీ, పంట తొలగించడానికి కూలీలకు సుమారు రూ.1.5 లక్షలు ఖర్చు చేశాను. చివరకు 22 బస్తాల వేరుశనగ కాయల దిగుబడి వచ్చింది. 45 కిలోల బస్తా రూ. 3 వేలతో అమ్మగా నాకు కేవలం రూ. 66 వేలు వచ్చింది. ఒక ట్రాక్టరు వేరుశనగ గడ్డి వచ్చింది.పెట్టుబడిలో సగం కూడా రాలేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

– దాసిరెడ్డి, రైతు, బీడుపల్లి

ప్రతిపాదనలు పంపాం



ప్రత్యామ్నాయ విత్తనాలతో పాటు రబీ సీజన్‌లో సాగు చేయడానికి సీడ్ విలేజ్ ప్రోగ్రాం కింద విత్తనాలు అవసరం ఉందని ప్రతిపాదనలు పంపాము. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే రైతులకు తెలియజేస్తాము. ఈశాన్య రుతుపవనాల్లో, తుపాను కారణంగా అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకూ వర్షాలు కురుస్తాయి. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– రామునాయక్, జిల్లా వ్యవసాయాధికారి

స్కాలర్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం సెంట్రల్: జిల్లాలో ఉన్న మాజీ సైనికులు, వితంతవుల పిల్లలు 2025–26 విద్యా సంవత్సరంలో ప్రధాన మంత్రి ఉపకార వేతనం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సైనిక సంక్షేమ అధికారి తిమ్మప్ప ఒక ప్రకటనలో తెలిపారు. వృత్తి విద్య, డిగ్రీ మొదటి సంవత్సరం (ఎంబీబీఎస్, బీడీఎస్, ఎంబీఏ) చదువుతున్న వారు అర్హులన్నారు. డిసెంబర్ 31లోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

జెడ్పీలో పదోన్నతుల కార్యాచరణ

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 65 మందికి అవకాశం

అనంతపురం టవర్‌క్లాక్: జిల్లా పరిషత్ పరిధిలోని ఉమ్మడి జిల్లా ఉద్యోగులకు పదోన్నతులు దక్కనున్నాయి. ఇందుకు సంబంధించిన కార్యాచరణను చేపట్టినట్లు డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య మంగళవారం తెలిపారు. సీనియర్ అసిస్టెంట్లు, గ్రేడ్–1 పంచాయతీ కార్యదర్శులకు డిప్యూటీ ఎంపీడీఓలుగా పదోన్నతులు కల్పించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,019 మందికి లబ్ధి చేకూరనుండగా ఇందులో ఉమ్మడి జిల్లాలో 65 మంది ఉండడం గమనార్హం. పది వేల జనాభా కలిగిన ప్రతి పంచాయతీకి డిప్యూటీ ఎంపీడీఓను నియమించనున్నారు. దీంతో ఇకపై ఈఓఆర్డీలను డిప్యూటీ ఎంపీడీఓలుగా పిలువనున్నారు. పదోన్నతులకు సంబంధించిన ఉత్తర్వులు ఈ నెల 20 తేదీలోపు అధికారికంగా వెలువడనున్నట్లు తెలిసింది. త్వరలో కింది స్థాయి ఉద్యోగులకూ పదోన్నతులు కల్పించనున్నట్లు సమాచారం.

క్లుప్తంగా

ఊరుబావిని శుభ్రం చేయించండి

- కలెక్టర్ శ్యాం ప్రసాద్



ఊరుబావిని పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

పుట్టపర్తి అర్బన్: మండలంలోని వెంకటగారిపల్లిలో ఉన్న ఊరుబావిని శుభ్రం చేయించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదేశించారు. మంగళవారం వెంకటగారిపల్లి గ్రామంలో చేపట్టిన ప్రత్యేక శుభ్రతా కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. డీపీఓ సమత, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 20వ తేదీ వరకూ జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో శుభ్రత, పర్యావరణ సంరక్షణ, చెత్త నిర్వహణ, ప్లాస్టిక్ నిషేధం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామంలోని ఊరుబావి వర్షపు నీళ్లతో నిండుగా ఉందని, వెంటనే శుభ్రం చేయిస్తే ప్రజలకు ఉపయోగంగా ఉంటుందన్నారు. బావిలోకి చెత్తాచెదారం వేయకుండా ప్రజలను చైతన్యపరచాలన్నారు. గ్రామీణ ప్రాంతాలను ఆరోగ్యంగా తీర్చి దిద్దడానికి ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి శుభదాస్, తహసీల్దార్ కళ్యాణ చక్రవర్తి, ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి, సర్పంచ్ లక్ష్మీనరసమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు చిన్నారులను రక్షించిన పోలీసులు



చెన్నేకొత్తపల్లి పోలీసులకు చిన్నారులను అప్పగిస్తున్న పాకాల పోలీసులు

పాకాల: తప్పిపోయి రైల్వేస్టేషన్‌లో తచ్చాడుతున్న ఇద్దరు చిన్నారులను చిత్తూరు జిల్లా పాకాల పోలీసులు కాపాడారు. వివరాలు.. శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలానికి చెందిన మోహన్‌రాజ్ కుమారుడు కుమ్మర వరుణ్, సురేంద్ర కుమారుడు సి.తరుణ్ ఈ నెల 11న తప్పిపోయినట్టు తల్లిదండ్రులు సీకేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే పాకాల రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా కనిపించిన చిన్నారులను గమనించిన రైల్వే పోలీసుల సమాచారంతో పాకాల పోలీసులు అక్కడకు చేరుకుని వారిని ఆధీనంలోకి తీసుకున్నారు. విచారణ అనంతరం సీకేపల్లి మండలానికి చెందిన వారుగా నిర్ధారించుకుని సమాచారం ఇవ్వడంతో సీకేపల్లి పోలీసులు మంగళవారం పాకాలకు చేరుకుని చిన్నారులను ఆధీనంలోకి తీసుకున్నారు.

మళ్లీ దగాపడిన మహిళలు

- అతివల ఆర్థిక స్వావలంబనకు తూట్లు
- ప్రచారార్భటంతోనే సరిపెట్టిన కూటమి సర్కార్
- ఉమ్మడి జిల్లాలో 85 కేంద్రాల్లో 9,500 మంది మహిళలకు కుట్టు శిక్షణ
- మూతపడిన కేంద్రాలు.. కనిపించని కుట్టుమిషన్ల జాడ
- ముగ్గురు మంత్రులు ఉన్నా మహిళలకు అన్యాయమే



మంత్రి సవిత సొంత నియోజకవర్గ కేంద్రం పెనుకొండలో మూతపడిన కుట్టు శిక్షణా కేంద్రం

పెనుకొండ: చంద్రబాబు పాలనలో ప్రతిసారీ దగా పడుతూ వచ్చిన మహిళలు... తాజాగా మరోసారి మోసపోయారు. మహిళల్లో ఆర్థిక స్వావలంబన పెంచుతామని, ఇందు కోసం ప్రభుత్వం తరఫున కుట్టు శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసి, శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కుట్టుమిషన్లు అందజేస్తామంటూ గొప్పలకు పోయిన ప్రభుత్వం ఆచరణలో ఘోరంగా విఫలమైంది. ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన కుట్టు శిక్షణ కేంద్రాలు మూడు నెలలు తిరక్కనే మూతపడ్డాయి. శిక్షణ పొందిన వారికి కుట్టుమిషన్లు అందజేయకుండా ప్రభుత్వం మొండి చెయ్యి చూపింది. ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా... కుట్టు శిక్షణ ఇచ్చి హామీ నెరవేర్చకపోవడం సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ముచ్చటగా మూడు నెలలే..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 8 నెలల అనంతరం మహిళలకు స్వయం ఉపాధి పథకం కింద బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కుటు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఉమ్మడి అజిల్లాలో ఈ ఏడాది ఏప్రిల్ 25న మొత్తం 85 కేంద్రాలను ప్రతి నియోజకవర్గంలోనూ ఏర్పాటు చేశారు. 18 నుంచి 60 ఏళ్లలోపు ఉన్న 9,500 మంది మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చారు. శిక్షణ అనంతరం బీసీ కార్పొరేషన్ అందించే రుణాలతో తమ బతుకుల్లో వెలుగులు నిండుతాయని అందరూ భావించారు. ఎంతో ఆశతో 3 నెలల పాటు శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కుట్టుమిషన్లు, రుణాలు అందజేయడంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. శిక్షణ పూర్తి చేసుకుని 4 నెలలు దాటినా ఇప్పటి వరకూ ఏ ఒక్కరికీ కుట్టు మిషన్ అందలేదు. నిధులు విడుదల చేయకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఈ అంశంపై ప్రభుత్వం కానీ, మంత్రులు కాని పెదవి విప్పక పోవడం గమనార్హం.

సిబ్బందికీ అందని వేతనాలు

ఒక్కో శిక్షణా కేంద్రానికి ఒక శిక్షకుడితో పాటు, కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించారు. పెనుకొండ నియోజకవర్గంలోని 28 సెంటర్‌లకు మాత్రం ఇద్దరు టీచర్లను నియమించారు. వీరికి శిక్షణ అందించే టీచర్‌కు నెలకు రూ. 15 వేలు, కంప్యూటర్ ఆపరేటర్‌కు రూ. 12 వేలు వేతనం ఇవ్వాలి. 3 నెలల్లో సిబ్బందికి అరకొర వేతనాలు ఇచ్చి మిగిలిన వేతనాల గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. ఉమ్మడి జిల్లాలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, బీసీ సంక్షేమ, చేనేత జౌళీశాఖ మంత్రి సవిత, వైద్య ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ ఉన్నా.. మహిళలకు మాత్రం న్యాయం జరక్కపోవడం విశేషం. ఇది నిరవధిక ప్రక్రియ అని మంత్రులు ప్రారంభ సమయంలో పేర్కొన్నారు. అయితే మొదటి విడతకే నిధులు విడుదల కాక దిక్కులేని పరిస్థితి ఉంటే ఇక రెండో విడత ఎలా మొదలు పెడతారో మంత్రులే చెప్పాలి.

కుట్టుమిషన్లు అందించాలి



శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు వెంటనే కుట్టు మిషన్లు అందజేయాలి. 4 నెలలు గడుస్తున్నా వారికి ఎలాంటి మిషన్లు అందించకపోవడం, ఆర్థిక సహకారం చేయకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం.

– బాబావలి, సీఐటీయూ మండల కార్యదర్శి, పెనుకొండ

నిధులు మంజూరు కాలేదు

కుట్టు శిక్షణ పూర్తయి 3 నెలలు కావస్తోంది. ఇందుకు సంబంధించి ఇంకా నిధులు విడుదల కాలేదు. నిధులు మంజూరైన వెంటనే శిక్షణ పొందిన మహిళలకు కుట్టుమిషన్లు అందజేస్తాం. అనంతరం రెండవ విడత శిక్షణా కేంద్రాలను ప్రారంభిస్తాం.

సుబ్రహ్మణ్యం, ఈడీ, బీసీ కార్పొరేషన్, ఉమ్మడి జిల్లా

ఉద్యాన అభివృద్ధికి కేంద్రం సహకారం

- వర్క్‌షాపులో రాష్ట్ర ఉద్యానశాఖ కన్సల్టెంట్ విద్యాశంకర్



మాట్లాడుతున్న విద్యాశంకర్

అనంతపురం అగ్రికల్చర్: క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (సీడీపీ) కింద ఉద్యాన పంటల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందింస్తున్నామని, ఇందుకు కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని నేషనల్ హార్టికల్చర్ బోర్డు (ఎన్‌హెచ్‌బీ) సహకారం అందిస్తోందని ఉద్యానశాఖ సీడీపీ రాష్ట్ర కన్సల్టెంట్ విద్యాశంకర్ తెలిపారు. మంగళవారం అనంతపురంలోని ప్రాంతీయ ఉద్యాన శిక్షణా కేంద్రంలో ఉమ్మడి జిల్లాల ఉద్యానశాఖ అధికారులు డి.ఉమాదేవి, జి.చంద్రశేఖర్‌తో కలిసి అధికారులు, రైతులు, ఎంటర్‌ప్రెనూర్స్‌కు వర్క్‌షాపు నిర్వహించారు. విద్యాశంకర్ మాట్లాడుతూ..జిల్లాలో ఇప్పటికే అరటి పంటను క్లస్టర్ కింద ఎంపిక చేసి ఎస్‌కే సంస్థ, ఫ్రెష్‌కార్టు సంస్థలకు సీడీపీ పథకం అమలుకు ప్రాథమికంగా అనుమతులు ఇచ్చామన్నారు. జిల్లా పరిధిలో కనీసం రూ.100 కోట్లు విలువ చేసే పంటను ఎంపిక చేసుకుని ముందుకు వచ్చే సంస్థలు, ఎఫ్‌పీఓలకు ప్రోత్సాహకాలు ఇస్తామన్నారు. 20 శాతం వాటా భరిస్తే... 20 శాతం బ్యాంకు రుణం, 20 శాతం సభ్యులైన రైతుల వాటా, మిగిలిన 40 శాతం కేంద్ర ప్రభుత్వం గ్రాంటు రూపంలో అందిస్తుందన్నారు. ఉమ్మడి జిల్లాలో దానిమ్మ, చీనీ, అరటి, టమాట, మిరప, కర్బూజా, కళింగర పంటలకు సీడీపీ కింద తీసుకునే అవకాశాలు ఉన్నాయన్నారు. విత్తనం, మొక్కలు, ఎగుమతులు, కల్టివేషన్, పోస్ట్ హార్వెస్టింగ్, బ్రాండింగ్, లాజిస్టిక్స్ అంశాలపై ఏదైన ఒక పంటను ఎంపిక చేసుకున్న సంస్థ తమ దగ్గరున్న వనరులు, మౌలిక సదుపాయాలతో కూడిన ప్రాజెక్టు రిపోర్టు అందిస్తే అనుమతులు జారీ చేస్తామన్నారు. దీని వల్ల ఎఫ్‌పీఓలు, సంస్థలు ఆర్థికంగా పరిపుష్టి సాధించడంతో పాటు రైతులకు మెరుగైన లాభాలు ఉంటాయన్నారు. నాణ్యమైన పంట పండించడంతో పాటు బ్రాండింగ్ ద్వారా మార్కెటింగ్ పరిస్థితి మెరుగై ఎగుమతుల ద్వారా ఉద్యాన పంటల ద్వారా రైతుల ఆర్థిక పురోగతి సాధ్యమవుతుందని తెలిపారు.

యానిమేటర్ చేతివాటంపై విచారణ



విచారణ చేపట్టిన డీపీఎం అరుణకుమారి

రొళ్ల: మండలంలోని జీబీహళ్లి గ్రామంలో యానిమేటర్ తిమ్మరాజు చేతివాటంపై మంగళవారం మధ్యాహ్నం డీపీఎ అరుణకుమారి విచారణ చేపట్టారు. తనకు నగదు అవసరముందని, పొదుపు సంఘాల సభ్యుల పేరుమీద బ్యాంకుల ద్వారా మంజూరైన రుణం తీసుకుని తానే చెల్లిస్తానంటూ నమ్మబలికి రెండేళ్లుగా చెల్లించకుండా తిమ్మరాజు చేసిన మోసంపై పలువురు సభ్యులు రాతపూర్వకంగా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో డీపీఎం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. తిమ్మరాజుతో పాటు బాధిత జేకే మారుతి, ధనలక్ష్మి పొదుపు సంఘాల సభ్యులతో సమావేశమయ్యారు. తమ పేరుపై రెండేళ్ల క్రితం మంజూరైన రూ.4 లక్షల రుణాన్ని తిమ్మరాజు తీసుకున్నాడని సభ్యులు ఆధారాలతో సహా చూపించారు. రెండేళ్లుగా అసలు, వడ్డీ చెల్లించకుండా ముఖం చాటేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. తీసుకున్న మొత్తానికి ఇప్పటి వరకూ అసలు, వడ్డీ కలిపి సుమారు రూ.6.5 లక్షలకు పైగా అవుతుందని యానిమేటర్‌పై చర్యలు తీసుకుని రుణం మొత్తాన్ని చెల్లించేలా చొరవ తీసుకోవాలని కోరారు. అయితే తాను రూ.2.5 లక్షలు మాత్రమే చెల్లిస్తానంటూ తిమ్మరాజు తెలపడంతో, అలా కుదరదని మొత్తం చెల్లించాల్సిందేనంటూ సభ్యులు మండిపడ్డారు. బ్యాంక్ స్టేట్‌మెంట్ తీసుకుని పరిశీలించిన అనంతరం మొత్తం డబ్బు కట్టించేందుకు చర్యలు తీసుకుంటామని డీపీఎం హామీనిచ్చారు. వారం రోజుల్లోపు చెల్లించకపోతే చర్యలు తీసుకుంటామని యానిమేటర్ తిమ్మరాజును హెచ్చరించారు. కార్యక్రమంలో వెలుగు అధికారులు, పొదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఆ గ్రామంలో పాఠశాల మధ్యాహ్నం వరకే!



మధ్యాహ్నానికే మూతపడిన సంగాల ప్రభుత్వ పాఠశాల

బత్తలపల్లి: ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రభుత్వ పాఠశాలలు ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగాలి. అయితే బత్తలపల్లి మండలం సంగాల గ్రామంలో మధ్యాహ్నం వరకే నిర్వహిస్తుండడం గమనార్హం. పాఠశాలలో ఆరుగురు విద్యార్థులు ఉన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యార్థులకు విద్యతో పాటు ఆటపాటలు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడు మధ్యాహ్నం తర్వాత విద్యార్థులను ఇంటి దారి పట్టించి తన దారిన తాను వెళ్లిపోతున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలపై విద్యాధికారులు పర్యవేక్షణ లోపించడమే ఇందుకు కారణమని ఆరోపిస్తున్నారు. విషయంపై ఎంఈఓ-2 సుధాకర్‌నాయక్‌ను వివరణ కోరగా.. సమస్య తమ దృష్టికి రాలేదన్నారు. సమస్య ఏమిటో తెలుసుకుని ఉపాధ్యాయుడితో ఆరా తీస్తామన్నారు.

మూగజీవాలపై చిరుతల దాడి

కుందుర్పి: మండలంలోని కర్ణాటక సరిహద్దున ఉన్న కొత్తపల్లి గ్రామ సమీపంలో మేతకు వెళ్లిన రెండు ఆవులపై మంగళవారం మధ్యాహ్నం చిరుతలు దాడి చేసి చంపేశాయి. అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకుని చిరుత దాడుల్లో మృతి చెందిన మూగజీవాలకు పరిహారం అందించాలని బాధిత రైతులు మారెన్న, పెద్ద రామప్ప, రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం టౌన్: స్థానిక కణేకల్లు రోడ్డులో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ విభాగంలో ఖాళీగా ఉన్న ఎంఎల్‌టీ (మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్) గెస్ట్ లెక్చరర్ పోస్టుకు ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ విజయలక్ష్మి కోరారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంఎస్సీ బయోకెమిస్ట్రీ, ఎంఎస్సీ మైక్రో బయాలజీ లేదా ఎంబీబీఎస్ విద్యార్హత ఉన్న వారు 16వ తేదీ గురువారం సాయంత్రంలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విద్యాశాఖ బాధ్యతారాహిత్యం

- నిబంధనలకు విరుద్ధంగా జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు ఉపాధ్యాయుడి కేటాయింపు

మడకశిర: విద్యాశాఖ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించింది. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలకు ఉపాధ్యాయులను కేటాయించి తన బాధ్యతారాహిత్యాన్ని బహిర్గతం చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఇటీవల డీఎస్సీ–2025లో అర్హత సాధించి ఉపాధ్యాయులుగా ఎంపికన వారికి ప్రభుత్వం వెబ్‌ఆప్షన్ ద్వారా పాఠశాలలను కేటాయించింది. నూతన ఉపాధ్యాయులందరూ సోమవారం వారికి కేటాయించిన పాఠశాలల్లో విధుల్లోకి చేరారు. మడకశిర నియోజకవర్గంలోని మడకశిర, అగళి, రొళ్ల, గుడిబండ, అమరాపురం మండలాల పరిధిలో దాదాపు 164 మంది నూతన ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. మడకశిరలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు నూతన ఉపాధ్యాయుడు రామాంజనేయులును నిబంధనలకు విరుద్ధంగా నియమించడం వివాదాస్పదమవుతోంది. సదరు ఉపాధ్యాయుడు సోమవారం వచ్చి విధుల్లో చేరారు. నిబంధనల ప్రకారం జెడ్పీ బాలికోన్నత పాఠశాలల్లో 55 ఏళ్ల పైబడిన ఉపాధ్యాయులనే నియమించాలి. అయితే రామాంజనేయులుకు 40 సంవత్సరాల లోపే వయసు ఉంది. ఇదే విషయాన్ని పాఠశాల హెచ్‌ఎం ఆయనకు తెలిపి ఈ పాఠశాలలో పని చేయడానికి వీలు ఉండదని తెలిపారు. దీంతో సదరు నూతన ఉపాధ్యాయుడు అయోమయంలో పడ్డారు. దీంతో బాధిత ఉపాధ్యాయుడు ఈ విషయాన్ని విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈ విషయాన్ని స్థానిక ఎంఈఓ భాస్కర్ సైతం డీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా వెబ్‌ఆప్షన్‌లో విద్యాశాఖ ఈ నిబంధనలను ఎక్కడా చూపకపోవడమే కారణంగా తెలుస్తోంది. వెబ్‌ఆప్షన్‌లో స్పష్టంగా పేర్కొని ఉంటే ఈ తప్పు జరిగేది కాదని నూతన ఉపాధ్యాయులు అంటున్నారు.

ఆంధ్ర, ఢిల్లీ మ్యాచ్‌కు సర్వం సిద్ధం

అనంతపురం కార్పొరేషన్: అండర్ –23 సీకే నాయుడు క్రికెట్ ట్రోఫీలో భాగంగా ఆంధ్ర, ఢిల్లీ జట్ల మధ్య జరిగే టెస్ట్ మ్యాచ్‌కు ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటర్‌లో ఏర్పాటు పూర్తి చేశారు. ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు మ్యాచ్‌లు జరగనున్నాయి. ఇది వరకే ఆంధ్ర జట్టు జిల్లాకు చేరుకోగా.. ఢిల్లీ జట్టు మంగళవారం స్పోర్ట్స్ సెంటర్‌కు చేరుకుంది. ఉదయం, సాయంత్రం ఇరు జట్లు నెట్స్‌లో ముమ్మర సాధన చేశాయి. మ్యాచ్ కోసం జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లను చేసినట్లు కార్యదర్శి భీమలింగారెడ్డి తెలిపారు.

మందుల దుకాణాల్లో తనిఖీలు

కుందుర్పి: మండల కేంద్రంలోని పలు మందుల దుకాణాల్లో డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ మాధవి మంగళవారం తనిఖీలు చేపట్టారు. మలయనూరు, జంబుగుంపల, మహంతపురం, ఎనుములదొడ్డి, ఎర్రగుంట, నిజవల్లి తదితర పంచాయతీల్లో విషజ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న తరుణంలో ప్రజల ఫిర్యాదుల మేరకే తనిఖీలు చేపట్టినట్లు సమాచారం.

చికిత్స పొందుతూ ఆర్టీసీ డ్రైవర్ మృతి

పుట్లూరు: మండల పరిధిలోని ఎ.కొండాపురం వద్ద ఈ నెల 11న చోటు చేసుకున్న ప్రమాదంలో గాయపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆర్టీసీ డ్రైవర్ మహబూబ్ బాషా (53) మంగళవారం మృతిచెందాడు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. ప్రయాణికులతో వెళుతున్న ఆర్టీసీ బస్సును టిప్పర్ ఢీ కొనడంతో డ్రైవర్ మహబూబ్‌బాషా తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. బస్సు కండక్టర్ రాధాకుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పుట్లూరు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



వ్యక్తి మృతదేహం

హిందూపురం: స్థానిక బస్టాండ్ వద్ద మంగళవారం ఓ గుర్తుతెలియని వ్యక్తి (60) మృతి చెందాడు. ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి కింద పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

కర్ణాటక మద్యం స్వాధీనం

హిందూపురం: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని చిలమత్తూరు మండలం మొరసలపల్లి క్రాస్ వద్ద మంగళవారం కర్ణాటక మద్యం తరలిస్తూ భగవంతప్ప అనే వ్యక్తి పట్టుబడ్డాడు. నిందితుడి నుంచి 48 టెట్రా ప్యాకెట్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. అలాగే కోడూరు తోపు వద్ద వెంకటేష్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి10 లీటర్ల అనుమతుల్లేని కల్లును స్వాధీనం చేసుకున్నారు.

అందుబాటులో చీనీ మొక్కలు

ధర్మవరం రూరల్: మండలంలోని చిగిచెర్ల గ్రామం వద్ద ఉన్న ఉద్యాన శాఖ నర్సరీలో చీనీ మొక్కలు అందుబాటులో ఉన్నాయని ఉద్యాన శాఖ అధికారి అమరేశ్వరి మంగళవారం తెలిపారు. కావల్సిన రైతులు 73823 86882 కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవాలన్నారు.

వివాహిత ఆత్మహత్య

తనకల్లు: మండల కేంద్రంలోని వంటగ్యాస్ ఆఫీస్ సమీపంలో నివాసముంటున్న వివాహిత రేవతి (32) ఆత్మహత్య చేసుకుంది. శాంతమ్మ, వెంకటరమణ కుమార్తె అయిన రేవతికి ఓడీ చెరువు మండలం ములకవారిపల్లికి చెందిన రామాంజనేయులుతో పెళ్లైంది. ఇద్దరు కుమారులున్నారు. ఆరు నెలలుగా తీవ్ర మానసిక సమస్యలతో బాధపడుతున్న ఆమెకు కుటుంబసభ్యులు పలు ప్రాంతాల్లో చికిత్స చేయించినా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన రేవతి మంగళవారం ఇంట్లో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి రిమాండ్

గుంతకల్లు: రౌడీషీటర్ కమ్మ ఆనంద్‌ను హత్య చేసిన సలీమ్‌ను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు గుంతకల్లు సీఐ మనోహర్ తెలిపారు. మంగళవారం సాయంత్రం టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను ఆయన వెల్లడించారు. కమ్మ ఆనంద్, సలీమ్ ఇద్దరు మంచి స్నేహితులు. రోజూ కలిసి మద్యం సేవించేవారు. మద్యం మత్తులో సలీమ్ కుటుంబసభ్యుల గురించి ఆనంద్ అనుచితంగా మాట్లాడేవాడు. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి మద్యం సేవించిన వారు బస్టాండ్ ఏరియాలోని వీఎంఆర్ పార్కింగ్ వద్దకు చేరుకున్న అనంతరం సలీమ్ కుటుంబసభ్యులపై ఆనంద్ నోరుపారేసుకున్నాడు. దీంతో మాటామాటా పెరిగి సలీమ్ ఆవేశం పట్టలేక ఆనంద్ ముఖంపై చేతితో గుద్ది కిందకు పడేసి అక్కడే ఉన్న రాయితో ఆనంద్ తలపై మోది హతమార్చాడు. ఆనంద్ పిన్నమ్మ రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన పోలీసులు హనుమన్ సర్కిల్ రైల్వేస్టేషన్ వద్ద తచ్చాడుతున్న సలీమ్‌ను మంగళవారం గుర్తించి అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

వృద్ధురాలి బలవన్మరణం

గార్లదిన్నె: మండలంలోని పెనకచెర్లలో నివాసముంటున్న లక్ష్మీదేవి(69) ఆత్మహత్య చేసుకుంది. ఆమెకు భర్త, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. తమకున్న 4.50 ఎకరాల్లో చీనీ సాగుకు, బోర్ల తవ్వకానికి ఇతరుల వద్ద చేసిన రూ.10 లక్షల అప్పు తీర్చే మార్గం కానరాక మదనపడుతూ అనారోగ్యానికి గురైన ఆమె... జీవితంపై విరక్తితో మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

తప్పుమీద తప్పు చేస్తున్న ప్రభుత్వం

- నకిలీ మద్యంపై ఎంపీ మిథున్‌రెడ్డి సీబీఐ విచారణ అడిగిన గంటల్లోనే 'సిట్' ఏర్పాటు
- కబ్జాదారులను విమర్శిస్తే కందికుంటకు బాధ ఎందుకో?
- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: 'రాష్ట్రంలో బయట పడిన నకిలీ మద్యపు డంపులు, ఫ్యాక్టరీల వ్యవహారం రాష్ట్ర ప్రతిష్టను దేశ వ్యాప్తంగా బజారుపాలు చేసింది. ఈ వ్యవహారం నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రభుత్వం తప్పుమీద తప్పు చేస్తోంది' అని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మండిపడ్డారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీబీఐ విచారణ కోరుతున్నామని చంద్రబాబు చెబితే హుందాగా ఉండేదన్నారు. సీబీఐ విచారణ జరపాలని ఎంపీ మిథున్‌రెడ్డి కోరిన గంటల వ్యవధిలోనే చంద్రబాబు సిట్ ఏర్పాటు చేశారన్నారు. నకిలీ మద్యం కుంభకోణం వెనుక రాష్ట్ర పెద్దల హస్తం ఉందని ప్రజలు నమ్ముతుండడంతో దిగజారుతున్న ప్రభుత్వ పరువును నిలబెట్టుకునే క్రమంలో ప్రతిపక్షంపై బురదజల్లేందుకు ముద్దాయి మాట్లాడినట్లు ఒక వీడియో విడుదల చేశారన్నారు. మరోవైపు ప్రజల దృష్టి మళ్లించేందుకే జోగి రమేష్ మీద అభాండాలు, మిథున్‌రెడ్డి కంపెనీల్లో 'సిట్' సోదాలతో హడావుడి చేస్తున్నారన్నారు.

భూ కబ్జా కనిపించలేదా?

అనంతపురం నగర శివారులోని పాపంపేట పొలంలో చేస్తున్నారన్నారు. 930 ఎకరాల శోత్రియం భూముల్లో నివాసం ఉంటున్న 15 వేల కుటుంబాల ఇళ్లు, స్థలాలను కచ్చా భూములుగా తప్పుడు రిజిస్ట్రేషన్ చేసుకుంటూ పాగా వేయాలని చూస్తున్నారన్నారు. ఇంత జరుగుతున్నా కలెక్టర్, జిల్లా రిజిస్ట్రార్, టీడీపీ, సీఎంఓ, ఇంటెలిజెన్స్ వర్గాలు ఎందుకు స్పందించలేదన్నారు.

కందికుంట ప్రసాద్‌కు బాధ ఎందుకో..?

రూ.కోట్లు విలువైన భూములు కబ్జా చేస్తున్న పరిటాల సునీత బంధువుల వ్యవహారంపై విమర్శిస్తే కందికుంట ప్రసాద్‌కు ఎక్కడ బాధ అయ్యిందో అని తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి విమర్శించారు. పరిటాల సునీత రాసిన లేఖ వల్ల 50 వేల ఇళ్ల నిర్మాణాలు ఆగిపోయింది వాస్తవమో కాదో మంత్రి పార్థసారథిని అడిగి తెలుసుకోవాలన్నారు. ధర్మవరంలో నేసేవారితో రూ.కోట్లు వసూళ్లు చేసింది పరిటాల శ్రీరామో కాదో మీ కుల పెద్దలను అడిగినా, మంత్రి సత్యకుమార్‌ను అడిగినా చెప్తారన్నారు. వ్యక్తిగతంగా విమర్శలు చేసుకోవడానికి మీకు, నాకు పొలం గట్ల తగాదాలేవీ లేవన్నారు. 'రూ.3 కోట్ల కారు అనేది పెద్ద విషయమా? ఏడుసార్లు గెలిచిన కుటుంబం వారి ట్రాక్ రికార్డు, రూ.150 కోట్లతో ఇల్లు కట్టుకోకూడదా? రూ. 15 కోట్లు విలువ చేసే కార్లు ఉండకూడదా? రూ.1000 కోట్ల ఆస్తులు వారు సంపాదించుకోకూడదా?' అంటూ కందికుంట వకాల్తా పుచ్చుకుని మాట్లాడుతున్నారన్నారు. హంద్రీ–నీవా కాలువ లైనింగ్ ఏర్పాటు చేస్తే భూగర్భజలాలు కిందకు ఇంకవని, లక్షల ఎకరాల భూములు బీళ్లుగా మారతాయని అన్ని రాజకీయ పార్టీలు గగ్గోలు పెడితే ఏమి చేశావు కందికుంట ప్రసాద్ అని నిలదీశారు. 'డీడీల స్కాం కేసులో సీబీఐ నీపై విచారణ జరిపించాలని సుప్రీం కోర్టులో అప్పీలు ఫైలైంది. ఇప్పుడు కోర్టు విచారణకు స్వీకరించింది. ఈ కేసులో నువ్వు జైలుకు పోకుండా చూసుకో. ఇదీ నీ ట్రాక్ రికార్డు' అని అన్నారు. ఇక నా ట్రాక్ రికార్డు మా నియోజకవర్గంలో ఎవరినడిగినా చెబుతారన్నారు.